5

త్యాగాల పండుగ బక్రీద్



- నేడు జరుపుకోనున్న ముస్లింలు
- ముస్తాబైన మసీదులు, ఈద్గాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేక ప్రార్థనలు



ముస్లింలు జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో బక్రీద్ ఒకటి. ధనిక, పేద తారతమ్యం లేకుండా ముస్లిందరూ ఈ పండుగను జరుపుకుంటారు. ఇస్లాం మతంలో రంజాన్ తరువాత అంత ప్రాముఖ్యత ఉన్న పండుగ ఈదుల్ జుహా (బక్రీద్). దీనినే త్యాగాల పండుగ అనికూడా పిలుచుకుంటారు. ఈదుల్ ఫితర్ తరువాత రెండు నెలలకు ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల (జుల్ హజ్జా) 10వ రోజున బక్రీద్ పండుగను జరుపుకుంటారు. దైవాజ్ఞకు లోబడి ఆ అల్లాహ్‌కు విశ్వాసంగా ప్రతీ ముస్లిం పరోప కార బుద్ధితో, శాంతియుత జీవనం గడుపుతూ ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలనే సందేశాన్ని ఈ పండుగ తెలియజేస్తుంది. సోమవారం బక్రీద్‌ను నిర్వహించుకునేందుకు ముస్లింలు సంసిద్ధమయ్యారు. ప్రార్థనలు చేసేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు.

- మహబూబాబాద్ (ఆంధ్రజ్యోతి)/జఫర్‌గడ్





స్మృతివనం కోసం ఎంపిక చేసిన ప్రదేశం చుట్టూ నిర్మాణంలో ఉన్న ప్రహరీ

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం.. వినోదం..

- పర్యాటకంగా మేడారం అభివృద్ధికి ప్రణాళిక
- జాతరప్పుడే అందుబాటులో గిరిజన మ్యూజియం, ఓపెన్ థియేటర్, ట్రైబల్ విలేజ్ సెట్టింగ్
- స్మృతివనం ఏర్పాటుతో పెరగనున్న సందర్శకులు
- జాతీయ పండుగ హోదా, నిధుల కోసం మంత్రి సీతక్క ప్రయత్నాలు

5

ప్రకృతి దేవతలు సమ్మక్క, సారలమ్మలు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం అభయారణ్యంలో కొలువైన తల్లుల దర్శనం భక్తులకు అనిర్వచనీయ అనుభూతి. రెండేళ్లకో సారి మహాజాతర, ఏడాదికోసారి మినీ జాతర జరుగుతుండగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి వనదేవతలను దర్శించుకుంటున్నారు. కొన్నేళ్లుగా సాధారణ రోజుల్లో కూడా తల్లులను దర్శించుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మేడారం పరిసరాలు, అటవీ ప్రాంతంలో విడిదిచేసి ఆహ్లాదంగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో వనదేవతల సన్నిధిని ఆధ్యాత్మికంగాను, పర్యాటకంగానూ అభివృ ద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జాతీయ పండుగ హోదాను సాధించడంతోపాటు మేడారం ఖ్యాతిని నలుచెరుగులా చాటిచెప్పేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా 25 ఎకరాలలో సమ్మక్క సారలమ్మలతోపాటు వనదేవతలకు సంబంధించిన విశేషాలతో స్మృతివనం నిర్మించనుంది.

- ములుగు



పలకరించిన తొలకరి జల్లులు

ములుగు, జూన్ 16: రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో తొలకరి జల్లులు కురుస్తున్నాయి. ఆదివారం పగలంతా కొనసాగిన ఎండ, ఉక్కపోతతో కూడిన వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశం మేఘావృతం కాగా వర్షం కురిసింది. దాదాపు అన్ని మండలాల్లో జల్లులు పడ్డాయి. మంగపేట మండలంలో గంటపాటు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ములుగు, ఏటూరునాగారం, తాడ్వాయి తదితర మండలాల్లో మోస్తరు వాన పడింది. ఈనెల 22 వరకు వారంరోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. 19వ తేదీ వరకు 10మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదవుతుందని, 20, 21తేదీల్లో 25మి.మీ, 22వ తేదీన కనీసం 50మి.మీ సగటు వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. గంటకు 12 నుంచి 20కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని పేర్కొంది. ఈ నేపథ్యంలో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు విత్తుకున్నారు. వర్షాలు లేకపోవడంతో గింజలు పాడైపోతున్నాయి. సుమారు 20 శాతం గింజలు మురిగిపోయాయి. మొత్తానికి మొత్తం నష్టపోవాల్సి వస్తుందని దిగులు పడుతున్న క్రమంలో వర్ష సూచనతో రైతుల్లో సంతోషం వెల్లివిరిస్తోంది. ఇదేక్రమంలో వరి పండించే రైతులు కూడా ఏరువాకకు సిద్ధమవుతున్నారు.

భూపాలపల్లి జిల్లాలో జోరువాన

కాకతీయఖని : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం జోరుగా వర్షం కురిసింది. పలు మండలాల్లో చిరు జల్లులు కురవగా భూపాలపల్లి, గణపురం మండలాల్లో భారీగా వర్షం పడింది. చిట్యాల, టేకుమట్ల, రేగొండ, మహదేవపూర్, పలిమెల, కాటారం మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వాన కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు గంటల తరబడి చీకట్లో ఉండాల్సి వచ్చింది. మల్హర్ మండలంలోని అడ్వాలపల్లిలో పిడుగుపడి రెండు తాడిచెట్లు దగ్ధమయ్యాయి. అయితే.. వర్షం మాత్రం రైతులకు కాస్త ఊరట కలిగించింది.

ములుగు జిల్లాలో 14 మంది ఎస్సైల బదిలీ

ములుగు, జూన్ 16: ములుగు జిల్లాలో సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న 14మంది బదిలీ అయ్యారు. ఈమేరకు మల్టీజోన్-1 ఐజీ ఎ.వి.రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
రుద్రారపు హరీశ్	వీఆర్, ములుగు	ఎస్‌హెచ్‌వో, వాజేడు
ఎస్కే.తాజొద్దీన్	వీఆర్,ములుగు	ఎస్‌హెచ్‌వో, ఏటూరునాగారం
టీవీఆర్.సూరి	అటాచ్డ్ ఫ్రం జోన్-4	ఎస్‌హెచ్‌వో, మంగపేట
జె.సతీష్	ఎస్‌హెచ్‌వో, కొడిశాల	ఎస్‌హెచ్‌వో, వెంకటాపూర్
కె.తిరుపతిరావు	వీఆర్, ములుగు	ఎస్‌హెచ్‌వో, వెంకటాపురం
వెంకటేశ్వర్‌రావు	ఎస్‌హెచ్‌వో, వాజేడు	ఎస్‌హెచ్‌వో, ములుగు
జి.కృష్ణప్రసాద్	ఎస్‌హెచ్‌వో, ఏటూరునాగారం	ఎస్‌హెచ్‌వో, పేరూరు
ఇ.వెంకటేష్	ఎస్‌హెచ్‌వో, నార్లాపూర్	ఎస్‌హెచ్‌వో, కన్నాయిగూడెం
ఎ.వెంకటేశ్వర్	ఎస్‌హెచ్‌వో, ములుగు	వీఆర్,ములుగు
జి.రవికుమార్	ఎస్‌హెచ్‌వో, మంగపేట	వీఆర్,ములుగు
సీహెచ్.రాజు	ఎస్‌హెచ్‌వో, వెంకటాపూర్	వీఆర్, ములుగు
ఆర్.అశోక్	ఎస్‌హెచ్‌వో, వెంకటాపురం	వీఆర్, ములుగు
జి.రమేష్	ఎస్‌హెచ్‌వో, పేరూరు	వీఆర్, ములుగు
ఎం.సురేష్	ఎస్‌హెచ్‌వో, కన్నాయిగూడెం	వీఆర్, ములుగు



అండర్‌గ్రౌండ్ గనిలో సైడ్ డిశ్చార్జ్ లోడర్

యంత్రం.. తూతూమంత్రం..

- సింగరేణిలో మొరాయిస్తున్న ఎస్‌డీఎల్ యంత్రాలు
- గనుల్లో కాలంచెల్లిన సైడ్ డిశ్చార్జ్ లోడర్లు
- అవస్థలు పడుతున్న ఆపరేటర్లు
- అండర్‌గ్రౌండ్ గనుల్లో బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం

కాకతీయఖని, జూన్ 16: సింగరేణిలో యాంత్రాల పనితీరు మందగించింది. మెషనరీస్ తరచూ మొరాయిస్తుండటం అధికారులకు, కార్మికులకు తలనొప్పిగా మారింది. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ బావుల్లో బొగ్గు ఉత్పత్తికి కీలకంగా ఉపయోగించే సైడ్ డిశ్చార్జ్ లోడర్లు (ఎస్‌డీఎల్) సరిగా పనిచేయడం లేదు. అవి మరమ్మ తులకు రాగా వాటి విడిభాగాలు లభ్యం కాకపోవడంతో తూతూమంత్రంగానే సరిచేసి ఆ యంత్రాలను నడిపించాల్సి వస్తోంది. కాలం చెల్లడం (సర్వేడ్ ఆఫ్) వల్లే ఎస్‌డీఎల్ యంత్రాలు తరచూ మొరాయిస్తున్నాయని తెలుస్తోంది. ఇవి సరిగా పనిచేయకపోవడంతో అండర్‌గ్రౌండ్ గనుల నుంచి అనుకున్న స్థాయిలో బొగ్గు ఉత్పత్తిని సాధించలేని పరిస్థితి నెలకొంది. భూపాలపల్లి ఏరియా అండర్‌గ్రౌండ్ గనుల్లోని ఈ యంత్రాలకు 2022లోనే కాలం చెల్లిందని కార్మికులు చెబుతున్నారు. యాజమాన్యం నూతన యంత్రాలు కొనుగోలు చేస్తుందని రెండేళ్లుగా వీరు ఎదురుచూస్తున్నారు.

అవస్థలు పడుతున్న ఆపరేటర్లు

సింగరేణి భూపాలపల్లి ఏరియాలో నాలుగు అండర్‌గ్రౌండ్ గనులు, రెండు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు ఉన్నాయి. బొగ్గును వెలికి తీసేందుకు అండర్ గ్రౌండ్ గనుల్లో పనిచేస్తున్న ఎస్‌డీఎల్ యంత్రాలు పూర్తిగా కాలం చెల్లినవి కావడంతో ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ యంత్రాలను వాడొద్దనే నిబంధన ఉన్నప్పటికీ వాటిని పక్కకు పడేయకుండా అధికారులు తమతో బలవంతంగా పనులు చేయి స్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా జరగరాని జరిగితే తమ కుటుంబాలకు దిక్కెవరని ప్రశ్నిస్తున్నారు. యాజమాన్యం ఇచ్చిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేందుకు సింగరేణి అధికారులు కాలం చెల్లిన యంత్రాలతోనే పని చేయిస్తూ తమపై ఒత్తిడి పెంచుతున్నారని చెబుతున్నారు. రెండే ళ్లుగా ఈ యంత్రాలను నడుపుతూ రోగాల బారిన పడుతున్నామని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. బొగ్గును తీస్తున్న క్రమంలో డిప్ డైరెక్షన్ ఎక్కాల్సి ఉంటుందని సూటబుల్ గ్రేడియెంట్ లేక అవి ఎక్కలేకపోతున్నాయని ఆపరేటర్లు అంటున్నారు. ఎంత ఎక్సలెటర్ ఇచ్చినా యంత్రానికి దమ్ము సరిపోవడంలేదని తెలిపారు. గంటల తరబడి పనిచేయాల్సిన ఎస్‌డీ ఎల్ యంత్రాలు తరుచూ మొరాయిస్తుండడంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర విఘాతం ఏర్పడుతోందని అంటున్నారు. నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను త్వరగా తీసుకురావాలని ఆపరేటర్లు డిమాండ్ చేస్తున్నారు.

బొగ్గు ఉత్పత్తికి విఘాతం!

సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని నాలుగు అండర్‌గ్రౌండ్ గనుల్లో 35 ఎస్‌డీఎల్ యంత్రాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అందులో ప్రస్తుతం 19 యంత్రాలు బొగ్గు ఉత్పత్తి కోసం పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే.. అవి కూడా కాలం చెల్లినవేనని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఎస్‌డీఎల్ యంత్రాలకు నాలుగేళ్ల కాలపరిమితి ఉంటుంది. లేదా 12వేల పని గంటలు, 12 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. ఆ తర్వాత యంత్రం మొరాయిస్తే దాన్ని పక్కకు పెట్టాల్సి ఉంటుంది. కానీ.. భూపాలపల్లి ఏరియా లోని ఎస్‌డీ ఎల్ యంత్రాలు 2022లో సర్వేడ్ ఆఫ్ అయినప్పటికీ వాటికి తూతూమంత్రంగా సరిచేసి పనులు చేయిస్తున్నారని కార్మికులు చెబుతున్నారు. యంత్రాలు మొరాయిస్తుండటంతో అండర్‌గ్రౌండ్ గనులలో బొగ్గు ఉత్పత్తి తగ్గుతోందని, ఇలాగే కొనసాగితే యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడం అసాధ్యమని కార్మికులు చెబుతున్నారు. అయితే.. సేల్ కాస్ట్ కన్నా, ప్రొడక్షన్ కాస్ట్ అధికమవుతోందని సింగరేణి అధికారులు తరుచూ చెబుతున్నారని, ఇది ము మ్మాటికీ అండర్ గ్రౌండ్ గనులను మూసేందుకు యాజ మాన్యం చేస్తున్న కుట్రేనని పలు సింగరేణి కార్మిక సంఘా లు ఆరోపిస్తున్నాయి. అండర్ గ్రౌండ్ గనులకు కావాల్సిన యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాయి.

కొత్తవి వస్తాయా..?

భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-1వ గనిలో నాలుగు, కేటీకే-5వ గనిలో ఐదు, కేటీకే-6వ గనిలో మూడు, కేటీకే-8వ గనిలో ఏడు ఎస్‌డీఎల్ యంత్రాలు ప్రస్తుతం పనిచేస్తున్నట్లు ఏరియా సింగరేణి అధికారులు చెబుతున్నారు. అయితే అవి పూర్తిగా కాలం చెల్లిపోయాయని సింగరేణి కార్మికులు ఆరోపిస్తున్నారు. ఏరియాకు నూతన ఎస్‌డీఎల్ యంత్రాలను కొనుగోలు చేసేందుకు 2022 నుంచి పనులు మొదలు పెట్టామని, ఒకసారి టెండర్ వేశామని అధికారులు చెబుతున్నారు. రేటు గిట్టుబాటు కాకపోవడంతో 2023లో ఆ టెండర్‌ను కార్పొరేట్ రద్దు చేసినట్లు సమాచారం. తిరిగి 2023 నవంబర్‌లో టెండర్ వేసినట్లు సింగరేణి అధికారులు చెబుతున్నారు. ఈసారైనా టెండర్ సక్సెస్ అయి ఏరియాకు నూతన యంత్రాలు వస్తాయా..? అని కార్మికులు ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా భూపాలపల్లి ఏరియా సింగరేణి అధికారుల 19 నూతన ఎస్‌డీఎల్ యంత్రాల కోసం మాత్రమే కార్పొరేట్‌కు అధికారులు ప్రతిపాదన పెట్టారని సమాచారం.

జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలి

- డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

గోవిందరావుపేట, జూన్ 16: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో జిల్లా అధ్యక్షుడు బి.సంజీవ అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం వివిధ శాఖల్లో ఖాళీలను భర్తీ నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో నిర్లక్ష్యం చేయకుండా నియామకాలు చేపట్టాలని, ఉద్యోగాలు ఇచ్చేంత వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.5 వేలు చెల్లించాలని అన్నారు. అదేవిధంగా గురుకుల విద్యాసంస్థల్లో వివిధ కేటగిరీల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, నాయకులు పూనం కృష్ణబాబు, పిట్టల అరుణ్, చంద్రశేఖర్, చంటి, దిల్వార్, వేణు, రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్లు



మంత్రి సీతక్కకు మొక్కను అందజేస్తున్న ములుగు కలెక్టర్ దివాకర



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 16: ములుగు టి.ఎస్.దివాకర, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వీరికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. దీంతో రెండు కలెక్టరేట్లలో సందడి నెలకొంది. ములుగు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకరకు అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సి.హెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని అన్నారు. త్వరలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించి జిల్లా అధికారుల సమన్వయంతో ములుగు జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు పాటుపడతానని అన్నారు. జిల్లాలోని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, సిబ్బంది కలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి అల్లం రాజ్‌కుమార్, డీపీఆర్‌వో రఫీఖ్, సిబ్బంది పాల్గొన్నారు.

భూపాలపల్లి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌శర్మకు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి సాధ్యమన్నారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో మంగిలాల్, జిల్లా అధికారులు నారాయణ రావు, శ్రీనివాస్, సామ్యూల్, వెంకటేశ్వర్లు, శైలజ, సునీత, నిర్మల, కలెక్టరేట్ ఏవో మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క కలిసిన ములుగు కలెక్టర్

ములుగు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దివాకర ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 16: వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో నేడు 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో, సెక్షన్ ఆఫీస్‌లలో, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విద్యుత్ ప్రజావాణిని పటిష్టపరచడంలో భాగంగా సమీక్షలు నిర్వహించి వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోబడుతాయన్నారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలున్న ప్రజావాణిలో ఫిర్యాదు చేయొచ్చన్నారు.



పగుళ్లు తేలిన 20వ పిల్లరు వద్ద కొనసాగుతున్న ప్లాస్టింగ్ పనులు

మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న మరమ్మతులు

మహదేవపూర్ రూరల్, జూన్ 16 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కుం గుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు పనులు కొనసాగుతు న్నాయి. బ్లాక్-7లో ఉన్న 11 గేట్లకు 10గేట్ల ఎత్తివేత ఇప్పటికే పూర్తికాగా కుంగుబాటు ప్రభావం అధికంగా ఉన్న 20వ నంబరు గేటు తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. బ్యారేజీ కిందున్న అగాధాన్ని పూడ్చేందుకు చేపట్టిన గ్రౌటింగ్ పనులతోపాటు షీట్‌ఫైల్స్ అమరిక, సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. బ్లాక్-7లోని 20 పిల్లరుతోపాటు గేట్ల బే ప్రాంతంలో తేలిన పగుళ్లను ఇసుక, సిమెంటు మిశ్రమాలతో ప్లాస్టింగ్ చేస్తున్నారు. గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక, సీసీ బ్లాకుల పనులు చివరి దశకు చేరుకున్న క్రమంలో పగుళ్లను మూసేసి ప్లాస్టింగ్ చేసే ప్రక్రియ ప్రారంభించినట్లు తెలుస్తోంది.

ఎర్రచెరువు పనులను అడ్డుకున్న రైతులు



ఆందోళన చేస్తున్న రైతులు

మహదేవపూర్, జూన్ 16: చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మండల కేంద్రంలో చేపడుతున్న ఎర్రచెరువు అభివృద్ధి పనులను స్థానిక రైతులు ఆదివారం అడ్డుకున్నారు. తమ పూర్వీకుల కాలం నుంచి సుమారు 50 ఎకరాలను 30 కుటుంబాలు సాగు చేసుకొని జీవిస్తున్నామన్నారు. అనేక వ్యయ ప్రయాసలకోర్చి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసుకున్నామని, ప్రభుత్వం సబ్సిడీ ద్వారా బోర్లు వేయించిందని వివరించారు. ఈ భూముల్లో వరి, పత్తి, మామిడి సాగు చేస్తున్నట్లు వివరించారు. ఎర్రచెరువు అభివద్ధి పేరుతో చేపట్టే పనుల వల్ల బ్యాక్ వాటర్ తమ పొలాల్లోకి వచ్చి మునిగిపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.

గోదావరిలో యువకుడి గల్లంతు



అఖిల్(ఫైల్)

మహదేవపూర్, జూన్ 16 : మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన ఓ యువకుడు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తూ గల్లంతయ్యాడు. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ నగరానికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు గరికపాటి ప్రవీణ్, రజిని దంపతుల కుటుంబ సమేతంగా కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వచ్చారు. స్నానాలు ఆచరించేందుకు గోదావరి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో వీరి కుమారుడు అఖిల్ (19) గోదావరి మధ్యలోకి వెళ్లి ఊబిలో చిక్కుకొని గల్లంతయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే కాళేశ్వరం పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై భవానీప్రసాద్ అక్కడికి చేరుకొని బోటు ద్వారా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభించలేదు. ప్రవీణ్, రజిని దంపతులకు కుమారుడు అఖిల్‌తోపాటు కుమార్తె ఉంది. ఆటో నడుపుకుంటున్న అఖిల్ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు.





పీడీఎస్ రైస్ పట్టివేత

రూ.4లక్షల 42వేల సరుకు స్వాధీనం


పోలీసులు పట్టుకున్న బియ్యం

వరంగల్ క్రైం, జూన్ 16: జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రూ.4లక్షల 42వేల విలువ కలిగిన 17 టన్నుల పీడీఎస్ రైస్‌ను పట్టుకున్నారు. చిల్పూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన ఎం.బంపయ్య, ఎం.రాజశేఖర్ ఇద్దరు పరిసర గ్రామాల్లో పీడీఎస్ రైస్ సేకరించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరిద్దరు సేకరించిన బియ్యం గ్రామ పరిసర ప్రాంతంలో ఒక ఇంట్లో పెట్టారని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రైస్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం చిల్పూర్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ దయాకర్ ధ్రువీకరించారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 16: హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో రాయితీ కోసం నిర్వహిస్తున్న స్కాలర్‌షిప్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సంస్థ డైరెక్టర్ రాముయాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 విద్యా సంవత్సరానికి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించి మెరిట్ ఆధారంగా కోర్సుల ఫీజుల్లో రాయితీని కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని, 23న స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరా లకు 9030610033, 9849167839 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 16: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మసాగర్‌కు చెందిన రౌండి శివకుమార్ (21) ఈ నెల 3న రాత్రి కాజీపేట డీజిల్ కాలనీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గాయాలపాలైన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అక్క రాజకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడు కూలీపని చేసుకుంటూ జీవిస్తుంటాడు. వివాహం కాలేదు. ఇతడికి ఒక సోదరి ఉంది.













అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్‌ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుట్లలో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్‌ఆర్‌ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్‌ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్‌ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్‌ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'చలో మొబిలిటీ'కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టులో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

త్యాగాల పండుగ బక్రీద్

● నేడు జరుపుకోనున్న ముస్లింలు ● ముస్తాబైన మసీదులు ● ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రత్యేక ప్రార్థనలు

'ఉన్నదొక్కటే... అది.. మానవ జాతి.. పంచాల్సింది ఒక్కటే... నిరంతర ప్రేమ.. ఎవరిపై ఎవరికీ ఎలాంటి ఆధిక్యతలు లేవు.. ఒకరి ధన, మాన, ప్రాణాలు మరొకరికి నిషిద్ధం.. ఒకరి హక్కును మరొకరు దోచుకోవడం శిక్షార్హం.. పగ, ప్రతీకారం, వడ్డీ, లావాదేవీలన్ని రద్దయ్యాయి..'
... 1500 యేళ్ల కిందట మహ్మద్ ప్రవక్త చివరి హజ్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలివీ.. ఆయన ప్రసంగం ఆద్యంతం మానవ హక్కులకు పెద్దపీట వేసింది. స్వేచ్ఛాయుత వాతావరణంలో సామాజిక ప్రగతిని ఉత్తమ జీవిత ప్రమాణాలను ఉద్బోధించారు. హజ్ వంటి ఆధ్యాత్మిక యాత్రలో సంప్రదాయాలు, ధార్మిక కట్టుబాట్ల గురించి కాకుండా మానవ హక్కుల గురించి మాట్లాడడం ప్రపంచ మానవ హక్కుల ప్రకటనగా భావించవచ్చు.



ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఫైల్)

మహబూబాబాద్, (ఆంధ్రజ్యోతి)/జఫర్‌గడ్, జూన్ 16: త్యాగబోధన పండుగైన బక్రీద్.. సకల మానవ లోకానికి సౌభ్రాతృత్వాన్ని, జాతి, మత, బీద, గొప్ప భేదాలను మాన్పి ప్రేమానురాగాలతో సంబంధాలను మరింత పెంపొందించేందుకు సందేశాన్ని ఇస్తుందని ప్రతీతి. ముస్లింలు ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 9గంటల లోపు వివిధ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితుల కనుగుణంగా నిర్దేశిత సమయానికి సామూహిక పండుగ ప్రార్థనల ఈద్‌గాహ్ మైదానాలకు చేరుకుంటారు. అక్కడ భేదాభావం లేకుండా అందరూ సహపంక్తిలో నిలబడి ప్రార్థనలు నిర్వహింప చేసే పెద్ద ఇమామ్‌ను అనుసరిస్తూ ఖుద్బా నమాజ్‌లో పాల్గొంటారు.

ఖుర్బానీతో అల్లాహ్‌పై విశ్వాసం

ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు త్వరగానే పూర్తి చేసుకున్న ముస్లింలు.. తమ గృహాలకు చేరుకుని ఖుర్బానీ ద్వారా అల్లాహ్‌పై విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ జంతు బలిదానాలు చేస్తారు. జంతు బలిదానం మాంసాన్ని మూడింట ఒక వంతు పేదలకు పంపిణీ చేయాలి. మిగిలిన రెండు భాగాల్లో ఓ భాగం తన సొంతానికి, మరో భాగం పొరుగు వారు, బంధుమిత్రులకు పంపి ణీ చేస్తారు. ఖుర్బానీ మాంసాన్ని ముస్లిమేతరులకు కూడా పంపిణీ చేయవచ్చని తద్వారా మానవులంతా ఒక్కటేనన్న భావన కలిగించినట్లవుతుందని ముస్లిం పెద్దలు చెబుతారు.

ఖుర్బానీ వెనుక పరీక్ష..

ఖుర్బానీ అంటే జంతుబలిదానం అని చెబుతారు. అన్ని ప్రేమల కన్నా దైవ ప్రేమ గొప్పదని, దీనికోసం అన్నింటినీ త్యాగం చేయాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడని ముస్లిం పెద్దలు చెబుతారు. ఆ ఆజ్ఞ తొలిసారిగా పరీక్షకు నిలిచిన సందర్భంగా ఖుర్బానీ తెరపైకి వచ్చిందని పేర్కొంటారు. దీన్ని ఉదహరించి విశ్లేషించే కథనాన్ని ఊటంకిస్తూ ఏటేటా బక్రీద్ ఈద్-ఉల్-జుహా జంతు బలిదానాలతో నిర్వహించుకుంటూ వస్తున్నారు.

ఖుర్బాని కథాకమామీషు వెనుక..

హజ్రత్ ఇబ్రహీంకు లేకలేక ఒక కొడుకు హజ్రత్ ఇస్మాయిల్ జన్మిస్తాడు. ఒక రోజు హజ్రత్ ఇబ్రహీం, తన కొడుకును జిబాహ్(వధ) చేస్తున్నట్లు కలగంటాడు. ఆ కల తనకు దైవాజ్ఞగా భావించి కల సారాంశాన్ని తన కొడుకు ఇస్మాయిల్‌కు చెబుతాడు. అదే అల్లాహ్ ఆజ్ఞ అయినప్పుడు తాను సిద్ధమేనని ఇస్మాయిల్ అంటాడు. హజ్రత్ ఇబ్రాహీం అల్లాహ్ ఆజ్ఞగా భావించి పుత్ర వాత్సల్యాన్ని జయించి కన్న కొడుకు ఇస్మాయిల్ మెడ మీద కత్తి తిప్పడానికి సిద్ధమవుతాడు. ఆ సమయంలోనే అల్లాహ్ ఇబ్రహీంలోని ప్రేమబలిని గుర్తించడంతో అక్కడ కొడుకు స్థానం లో గొర్రెపోతు ప్రత్యక్షమై జిబాహ్(బలి) అవుతుంది. ఇలా అల్లాహ్ పరీక్షలో ఇబ్రహీం నెగ్గుతారు. ఆ క్రమంలోనే ఖుర్బాని తెరపైకి వచ్చిందని ముస్లింలు విశ్వసిస్తారు.

బక్రీద్‌తోనే ఖుర్బానీ..

మనిషిలో ఈ త్యాగ భావాన్ని సజీవంగా, సచేతనంగా ఉంచడానికి యేటా బక్రీద్ పండుగ నాడు ముస్లింలు ఖుర్బానీ ఇస్తారు. అల్లాహ్ ఆదేశాల ఆంతర్యం ఇదేనని కోట్లాది మంది ముస్లిం ప్రజలు ఈ పండుగ రోజున జంతుబలిదానం చేస్తారు. త్యాగభావానికి తార్కాణమైన బక్రీద్ పండుగ మతసామరస్యానికి ఎంతో దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఖుర్బానీ, ఆధ్యాత్మిక, సామాజిక, కుటుంబ బాధ్యతలు, త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్ర(హజ్)ల ప్రాధాన్యతల గురించి ఈద్గా(సామూహిక ప్రార్థనా స్థలం)లపై ముస్లిం పెద్దలైన ఇమామ్‌లు ఉపన్యాసాలు చేస్తారు.

ఆధ్యాత్మిక యాత్ర హజ్..

త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్రను హజ్ అంటారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని సౌదీఅరేబియా దేశంలోని మక్కాలో ఉండే కాబా గృహాన్ని దర్శించే సంకల్పంతో లక్షలాది ముస్లింలు హజ్ యాత్రను చేస్తారు. ప్రపంచం నలుమూలల నుంచి ముస్లింలు మక్కా నగరానికి తరలివెళ్తారు. దైవప్రవక్తకు పూర్తిగా విధేయులై వారు జారీ చేసిన ప్రతీ ఆదేశాన్ని ఎటువంటి సంకోచం లేకుండా శిరసా వహించేలా హజ్ శిక్షణ ఇస్తుందని ముస్లింలు విశ్వసిస్తారు. ఇస్లామియా జీవన వ్యవస్థకు మూలస్థంభాలైన నమాజ్(ప్రార్థన), రోజా(ఉపవాసం), జకాత్(దానం)లతో పాటు హజ్ కూడా తప్పనిసరి అని ముస్లింలకు దైవాదేశం. అందువల్లే జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ముస్లింలు లక్ష్యంగా ఎంచుకుంటారు.

మౌలిక సూత్రాలు

ఇస్లాం ధర్మంలోని ఐదు మౌలిక సూత్రాలను యావత్ ప్రపంచ ముస్లింలు విధిగా పాటిస్తారు. మొదటిది సృష్టికర్త ఒక్కడేనన్న విశ్వాసం. రెండోది దైవ ప్రార్థన నమాజ్. మూడోది ఉపవాసం(రోజా), నాలుగోది జకాత్(ఆర్థిక విధానం). ఐదోది హజ్(కాబా సందర్శన యాత్ర). ఇందులో ఏ ఒక్కదాన్ని విస్మరించినా విశ్వాసం పరిపూర్ణం కాదని నమ్ముతారు. మానవుడు దైవ విశ్వాసి అనడానికి రుజువులు ఇవేనని చెబుతారు. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతీ ముస్లింపై హజ్ విధిగా నిర్ణయించబడింది. స్థోమత కలిగిన వారు జీవిత కాలంలో ఒక్కసారైనా ఈ యాత్ర చేయడం తప్పనిసరి. ఈ ఆరాధన జిల్‌హజ్జ్ మాసంలో సౌదీ అరేబియాలోని పవిత్రమైన మక్కా నగరంలో జరుగుతుంది. ఆ రోజే (ఈ నెల 17న) ప్రపంచంలోని ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. దీన్నే 'ఈద్-ఉల్-జుహ' అని, 'బక్రీద్' అని, 'ఈదెఖుర్బాన్' అని రకరకాలుగా వ్యవహరిస్తారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం.. వినోదం

● పర్యాటకంగా మేడారం అభివృద్ధికి ప్రణాళిక ● స్మృతివనం ఏర్పాటుతో పెరగనున్న సందర్శకులు



మేడారంలో ఆదివాసీల కళాప్రాంగణం



మేడారంలోని గిరిజన మ్యూజియం

ములుగు, జూన్ 16: మేడారం పరిధిలోని రెడ్డిగూడెం వద్ద జంపన్నవాగును ఆనుకొని ఉన్న 25ఎకరాల స్థలాన్ని స్మృతివనం కోసం ఎంపిక చేశారు. 2024మహాజాతర ఏర్పాట్ల సమయంలోనే రాష్ట్ర మంత్రి సీతక్క అధికారులకు చేసిన సూచనలతో స్మృతివనానికి శ్రీకారం చుట్టారు. స్థల పరిరక్షణ కోసం ప్రహరీగోడ నిర్మాణాన్ని మొదలు పెట్టారు. అయితే జాతర తర్వాత పనులు ముందుకు సాగలేదు. జాతరకు వచ్చే భక్తులు ఎక్కువగా విడిదిచేసే ప్రదేశాలలో జంపన్నవాగు, రెడ్డిగూడెం పరిసరాలు ప్రధానమైనవి. గద్దెలకు కేవలం కిలోమీటర్ దూరంలోనే ఉండటం, పుణ్యస్నానాల అనంతరం ఈ మార్గం గుండానే వనదేవతల దర్శనానికి వెళ్తుండటంతో స్మృతివనం భక్తులను పూర్తిస్థాయిలో అలరించనుంది. రాష్ట్ర పర్యాటక, దేవాదాయ శాఖ అధికారులు డీటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) రూపొందిస్తున్న నేపథ్యంలో వచ్చే జాతర నాటికి స్మృతివనం భక్తులకు అందుబాటులోకి వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

- ఆకట్టుకుంటున్న చిలుకలగుట్ట కుడ్య చిత్రాలు

సమ్మక్క తల్లి కుంకుమ బరిణె రూపంలో కొలువైన మేడారంలో అత్యంత విశిష్టత కలిగిన చిలుకలగుట్ట ఇప్పుడు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రహరీగోడ పై గతంలో రంగులతో వేసిన చిత్రాల స్థానంలో కుడ్య చిత్రాలను రూపొందించడం జరిగింది. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, సమ్మక్క, సారలమ్మల చిత్రాలను అందంగా తీర్చిదిద్దారు. గుట్ట పరిరక్షణ చర్యలను మరింత విస్తరించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. సుమారు 800ఎకరాలలో విస్తరించి ఉన్న చిలుకలగుట్టను 2018లో అప్పటి రాష్ట్రప్రభుత్వం ముగ్గురు పూజారుల పేరిట ఐటీడీఏ ద్వారా ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా చేసింది.

- గిరిజన మ్యూజియం, ఓపెన్ థియేటర్

గద్దెలకు సమీపంలో నిర్మించిన గిరిజన మ్యూజియం, హంపి ఓపెన్ థియేటర్ జాతర భక్తులను పూర్తిస్థాయిలో ఆకట్టుకోలేకపోతున్నాయి. మ్యూజియం నిర్వహణలో లోపాలున్నాయి. ఆదివాసీ సంస్కృతి, జీవన విధానాలను ప్రతిబింబించేలా వస్తువులను ఇక్కడ అందుబాటులో ఉంచారు. అయితే జాతర సమయంలో మాత్రమే భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నారు. సాధారణ రోజుల్లో మ్యూజియానికి వచ్చేవారి సంఖ్య తక్కువే. అక్కడ మ్యూజియం ఉందనే విషయం ఎక్కువ మందికి తెలియకపోవడం గమనార్హం. పక్కనే ఉన్న ఆదివాసీ కళాప్రాంగణం ఓపెన్ థియేటర్‌లో జాతర జరిగే నాలుగైదు రోజుల్లో మాత్రమే ఆదివాసీ కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. థింసా, గుస్సాడి, కొమ్ము నృత్యాలు, వనదేవతల ప్రాశస్త్యాన్ని, చరిత్ర ను చాటుతూ ప్రదర్శించే నాటికలను తిలకించే ందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారు. మ్యూజియం ప్రాంగణంలో తాత్కాలికంగా రూపొం దించే ట్రైబల్ విలేజ్ సెట్టింగ్ కూడా ఆకట్టుకుం టుంది. గడ్డి గుడిసెలు, ఎడ్లబండ్లు, ఆదివాసీలు ఉపయోగించే సంప్రదాయ పనిముట్లు తదితర వస్తువులను ప్రదర్శనకు ఉంచుతారు. అయితే జాతర అనంతరం కూడా ఇవన్నీ అందుబాటులోకి వస్తే భక్తులు, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రధానంగా సెలవు రోజులు, వీకెండ్‌లలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్మృతివనం నిర్మాణంతో భక్తుల ఆకాంక్ష కొంతమేరకు నెరవేరుతుంది.

- శాశ్వత నిర్మాణాలపై ముందుకు..

2018జాతర సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మేడారం గద్దెల విస్తరణ, సదుపాయల కల్పనకోసం భారీ ప్రకటన చేశారు. రూ.200కోట్ల నిధులతో 200ఎకరాలలో మేడారాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. కానీ, ఆచరణ సాధ్యం కాలేదు. అయితే అప్పటి అధికార యంత్రాంగం సమర్పించిన డీపీఆర్ భద్రంగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా 2024మహాజాతర ఏర్పాట్లకు ఆటంకం ఏర్పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడటం, సమయం తక్కువగా ఉండడంతో శాశ్వత నిర్మాణాలను వాయిదావేసి తాత్కాలిక ప్రాతిపదికన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిచ్చారు.

ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలకోడ్ కూడా ముగియడంతో జాతర అభివృద్ధి, శాశ్వత నిర్మాణాలపై దృష్టిసారించారు. గత జాతరకు ముందు జిల్లా యంత్రాంగం సమర్పించిన నివేదికతో పాటు సవరించిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. మళ్లీ 2026లో మహాజాతర జరుగుతుండగా ఈలోగానే యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. అధికారు లు అందుకు సమాయత్తమవుతున్నారు.

- స్మృతివనం ప్రతిపాదన హర్షనీయం

కొక్కెర రమేష్, సమ్మక్క పూజారి



మేడారంలో వనదేవతలకు స్మృతి వనం నిర్మించడం హర్షించతగిన విషయం. వనదేవతలైన సమ్మక్క, సారలమ్మలకు రూపం లేదు. పులి, జింకలు వారి వాహనాలని భక్తులు నమ్ముతుంటారు. భక్తుల నమ్మకాన్ని నిరూపించేలా వారి చరిత్ర, స్మృతులను తెలిపే విధంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు. స్మృతివనం ఏర్పాటుతో జాతరకు మరింత వైభవం రానుంది.

తల్లుల చరిత్ర ఆసక్తికరంగా ఉంటుంది

వల్లపు స్వామి, గజ్వేల్



సమ్మక్క, సారలమ్మ చరిత్ర ఆసక్తిక రంగా ఉంటుంది. వారి గురించిన మరిన్ని విశేషా లతో స్మృతివనం ఏర్పాటు చేస్తే తల్లుల గురించి తెలుసుకునేందుకు నాలాంటి భక్తులు ఎంతోమంది వస్తారు. నేను మేడారానికి రావడం ఇదే ప్రథమం. సంతానం కలగాలని దేవతలను ముడుపు కడితే మాకు పాప పుట్టింది. మొక్కు తీర్చుకునేందుకు ఇక్కడికి వచ్చాం.

హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి

దనసరి సీతక్క, రాష్ట్రమంత్రి



మేడారం జాతరకు జాతీయ పండుగ హోదా సాధనకోసం రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉంది. కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే క్రమంలో త్వరలో మంత్రుల బృందంతో కేంద్రం వద్దకు వెళ్తాం. ఇప్పటికే రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. మేడారం సమగ్రాభివృద్ధికోసం వనదేవతల భక్తురాలిగా, మంత్రిగా కృషిచేస్తా.

వివాదాల సుడిగుండంలో పాత కలెక్టర్!

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 16: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసిన భవేష్‌మిశ్రా ఉన్నట్టుండి బదిలీ కావడం, ఆయనకు ప్రభుత్వం ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకపోవడం జిల్లాలో చర్చనీయాంశమైంది. జిల్లాలో 2021 అక్టోబర్ నుంచి 2024 జూన్ వరకు దాదాపు 33 నెలల పాటు భవేష్ మిశ్రా విధులు నిర్వర్తించారు. మొదటిసారిగా కలెక్టర్‌గా పదోన్నతి పొంది భూపాలపల్లి జిల్లాకు వచ్చిన ఆయన వ్యవహారికం మొదటి నుంచే చర్చల్లో ఉంది. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యేతో కలెక్టర్ సఖ్యతగా మెదిలి వివాదాలకు కేంద్ర బిందువుగా నిలిచారని పలువురు అంటున్నారు. పలు అక్రమాలకు పాల్పడ్డారని బీఆర్ఎస్ నేతలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో భవేష్ మిశ్రా విమర్శలు ఎదుర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలకు ఆయన సహకరించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని చెరువుశిఖం భూములు కబ్జాలకు గురవుతున్నా భవేష్ మిశ్రా పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు ఆరోపించారు.

కొంపముంచిన ఫారెస్ట్ భూమి వ్యవహారం

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కొంపల్లి శివారు సర్వే నంబరు 171లో రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందిన 106.34 ఎకరాల భూమి సుప్రీంలో కోర్టులో ఉండగా కలెక్టర్ వ్యవహరించిన తీరు వావాదాలకు దారి తీసింది. సుప్రీం కోర్టులో కేసు నడుస్తుండగా ప్రభుత్వ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా అఫిడవిట్ ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో సుప్రీం రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోరడంతో కలెక్టర్ ఇచ్చిన అఫిడవిట్‌ను సీఎస్ వెనక్కి తీసుకున్నారు. దీంతో 106.43 ఎకరాల భూమి ఫారెస్ట్‌దే అని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దాదాపు రూ. 400 కోట్ల విలువైన ఫారెస్ట్ భూమిని ప్రైవేటు వ్యక్తుల పరంచేసేందుకు భవేష్ మిశ్రా అనుకూలంగా వ్యవహరించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు మంజూర్‌నగర్‌లోని సర్వేనంబరు 209లోని గోరంట్లకుంట శిఖం అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతోపాటు శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు అనుమతి ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నివేదికను కూడా భవేష్ మిశ్రా పక్కన పెట్టారని, దీంతో చేసేదేమీలేక ఇరిగేషన్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారని తెలుస్తోంది.

విచారణ కోసమేనా..?

ఫారెస్ట్ రిజర్వ్ భూమి వ్యవహారంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా భవేష్ మిశ్రా ఇచ్చిన అఫిడవిట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు ఆయనకు రూ. 5లక్షల జరిమానా విధించడంతోపాటుపూర్తి స్థాయిలో విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం ఎలాంటి విచారణకు ఆదేశించలేకపోయింది. తాజాగా భవేష్ మిశ్రాను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు పలువురు కలెక్టర్లు బదిలీ అయినా వారికి పోస్టింగ్ ఇచ్చింది. భవేష్ మిశ్రాకు ఎక్కడా పోస్టింగ్ కేటాయించకపోవడం చర్చనీయాంశమైంది. రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ భూముల వ్యవహారంపై విచారణకు సిద్ధమవుతోందని, అందులో భాగంగానే భవేష్‌మిశ్రాకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని పలువురు అంటున్నారు.

రాహుల్ శర్మ ముందు
పెను సవాళ్లు

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్‌శర్మకు సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. వర్షాకాలం కావడంతో జిల్లాను గోదావరి, మానేరు, మోరంచవాగు ముంచెత్తె అవకాశం ఉండటంతో కలెక్టర్ వరద నియంత్రణ ముందస్తుచర్యలు తీసుకోవాల్సి ఉంది. తాడిచర్ల జెన్కో ఓసీ భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. దీంతో పాటు జెన్కో కాన్వేయర్ బెల్ట్, సింగరేణి భూసేకరణ కలెక్టర్‌కు పెద్ద సవాళ్లే అని చెప్పొచ్చు. ముఖ్యంగా విజయవాడ- మంచిర్యాల గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణలో రైతుల నుంచి వ్యక్తమవుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ సమస్యను కూడా కలెక్టర్ పరిష్కరించాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో అక్రమణాలకు గురైన ప్రభుత్వ, చెరువు శిఖం భూముల పట్ల కలెక్టర్ ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తారో అనేది చర్చనీయాంశమైంది.

సోదరుడికి నివాళులర్పించిన సీతక్క



సాంబయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీతక్క

ములుగు, జూన్ 16: తన సోదరుడు ధనసరి సాంబయ్యకు రాష్ట్ర మంత్రి సీతక్క నివాళులర్పించారు. ములుగు మండలంలోని జగ్గన్నపేటలో ఆయన స్మారక స్థూపం వద్ద ఆదివారం జరిగిన వర్ధంతి కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. మంత్రి వెంట ఆమె కుమారుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సూర్య తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మంగపేట జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థులు

మంగపేట, జూన్, 16: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పదో తరగతి 1997-98 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలుసుకున్నారు. 26 సంవత్సరాల తర్వాత కుటుంబ సమేతంగా కలిసి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యా బోధనా చేసిన రామగోవిందం, లక్ష్మీనర్సయ్య, ఎల్లగౌడ్, రమేష్‌ను ఘనంగా సత్కరించారు. సుమారు 76 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర కార్ల దొంగల ముఠా అరెస్టు

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ ముసుగులో మోసపూరితంగా కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను కొనుగోలు పేరుతో ఇతరులకు, స్క్రాప్, నెదర్లాండ్, సౌత్ ఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు విక్రయిస్తున్న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలానికి చెందిన దశరథ్ ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాతకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఆర్థిక ఇబ్బందులతో భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసి, వాటికి సంబంధించిన ఫైనాన్స్ ఈఎంఐలు తామే కడతామని నమ్మించి, మోసపూరితంగా వాహనాలు తీసుకోనేవారన్నారు. వాటిని ఇతరులకు విక్రయించడమో స్క్రాప్ కింద అమ్మువారన్నారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్‌లోని పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, జైలు నుంచి విడుదలై వారి పద్ధతి మార్చుకోకుండా యథావిధిగా నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో తెలంగాణలోని వరంగల్‌లోని మట్టెవాడ, మోకిలా, మహబూబ్ నగర్‌లోని జడ్చర్ల, నాగర్‌కర్నూల్‌లోని కల్వకుర్తి, రాచకొండలోని కీసర పోలీస్ స్టేషన్లలో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని స్క్రాప్‌కు, నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారని, దీంతో హైదరాబాద్ నుంచి వాహనాలను స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. నిందితులు వరికుప్పల దశరథం, దుర్గం సందాన్, కొశెట్టి రాజేష్, మహమ్మద్ జాబీర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు స్విఫ్ట్ డిజైర్ కార్లు, ఒక ఇన్నోవా వాహనాన్ని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. స్వాధీనపర్చుకున్న వాహనాల విలువ రూ.70లక్షలు ఉంటుందని తెలిపారు. కేసు చేధించడంలో ప్రతిభ కనబర్చిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.కుమార్, క్రైమ్ టీం హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు అలీ, శివ, విజయ్‌కాంత్, హరికాంత్, జి.రాజేందర్, సల్మాన్‌లను డీసీపీ అబ్దుల్ బారి అభినందించారు. సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అబ్దుల్ బారి

సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌కు వీడ్కోలు సన్మానం



బదిలీపై వెళ్తున్న కోమల్ ప్రీతికౌర్‌తో సీఆర్‌పీఎఫ్ అధికారులు

కాటారం, జూన్ 16: కాటారంలో 58 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై అస్సాం రాజధాని గుహవటికి బదిలీ అయిన కోమల్‌ప్రీతికౌర్‌కు ఆదివారం ఘనంగా వీడ్కోలు సన్మానం జరిగింది. గత మూడేళ్లగా మహాముత్తారం, కాటారంలో సీఆర్‌పీఎఫ్ ఏసీగా పనిచేసిన కోమల్‌ప్రీతికౌర్‌ను స్థానిక సీఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది వీడ్కోలు పలికారు. శాలువాలు, బొకేలు, మొమెంటోలతో సన్మానించారు. 2023లో ఢిల్లీలో జరిగిన గణతంత్రదినోత్సవ వేడుకల్లో కోమల్‌ప్రీతికౌర్ నారీశక్తి శకట ప్రదర్శనలో పాల్గొని మహిళా సాధికారతను చాటారు. విధి నిర్వహణతో పాటు పలు సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్స్ నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ వరంగల్ డిప్యూటీ కమాండెంట్ సుమ, ఇన్‌స్పెక్టర్ మనోహరన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మహదేవపూర్, జూన్ 16 : లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని కాళేశ్వరం-మాదాపూర్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహదేవపూర్ మండలంలోని బీరసాగర్ గ్రామానికి చెందిన జైన మధురయ్య(50) బైక్‌పై అన్నారం నుంచి కాళేశ్వరం వస్తున్నాడు. అదే సమయంలో కాళేశ్వరం నుంచి మాదాపూర్ వెళ్తున్న ఇసుక లారీ వచ్చింది. ఈ క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో మధురయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మధురయ్యకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై భవానీసేన్ సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆటోను బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

కాటారం : ఆగి ఉన్న ట్రాలీ ఆటోను బైక్ ఢీకొని ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని గంగారం-అన్నారం రహ దారిపై బూడిదపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన నగేష్ అనే యువకుడు వ్యక్తిగత పని నిమిత్తం ఇంటి నుంచి గంగారం క్రాస్ రోడ్డు వైపు బైక్‌పై వెళ్తున్న నగేష్ అదుపుతప్పి ఆటోను ఢీకొనగా రోడ్డుపై ఎగిరిపడగా కాలుకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ కార్యాలయాల్లో ప్రజావాణి

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 16: విద్యుత్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ మల్సూర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలపై ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఏఈ, ఏడీఈ, డీఈ కార్యాలయాల్లో ప్రజావాణి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఈ కార్యాల యంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజావాణి నిర్వహిస్తామని తెలిపారు. బక్రీద్ సెలవు కావడంతో ఈ సోమవారం ప్రజావాణి నిర్వహించడంలేదని పేర్కొన్నారు. వచ్చే సోమవారం నుంచి నిర్వహిస్తామని తెలిపారు.

హేమాచలుడిని దర్శించుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్



హేమాచల క్షేత్రంలో హర్కర వేణుగోపాల్

మంగపేట, జూన్ 16: మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్ అండ్ పబ్లిక్ రిలేషన్స్) హర్కర వేణుగోపాల్‌రావు దర్శించుకున్నారు. బంధు, మిత్రులతో కలిసి హేమాచలుడిని ఆదివారం దర్శించుకున్నారు. ఆల య సంప్రదాయాల ప్రకారం అర్చక, ఉద్యోగులు ఆయనకు స్వాగ తం పలికారు. అర్చకులు రాఘావాచార్యులు, రాజశేఖరశర్మ, పవన్‌కు మారా చార్యులు ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. వేణుగోపాల్ వెంట ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబా సాహెబ్, ములుగు డీఎస్పీ రవికుమార్. మంగపేట ఎస్సై రవికుమార్ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వాజేడు, జూన్ 16: మండలంలోని చెరుకూరుకు చెందిన సొనప తిరుపతి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా అతడితో కలిసి పదోతరగతి చదువుకున్న మిత్రులు (1992 బ్యాచ్) దిగ్ర్భాంతి చెందారు. తిరుపతి కుటుంబానికి తమవంతు సాయంగా రూ.17,100 నగదును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకిషన్, సాయిని మహేష్, దేవర రవీందర్, శ్రీనివాస్, రజిత, రాజేశ్వర్, గోపి, గణేష్, భాస్కర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో
తాటిచెట్లు దగ్ధం



దగ్ధమవుతున్న తాటిచెట్లు

మల్హర్, జూన్ 16 : మండలంలోని అడ్వాలపల్లి శివారులో పిడుగుపాటుతో మూడు తాటిచెట్లు దగ్ధమయ్యాయి. ఆదివారం సాయంత్రం గాలివానతో పాటు ఒక్కసారిగా భారీ శబ్దంతో తాటిచెట్లపై పిడుగులు వేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

పత్తి మొక్కలకు ప్రాణాధారం

కాటారం : మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో గంటలపాటు కరెంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పది రోజులుగా వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్న రైతాంగానికి ఊరట లభించింది. రాత్రి కురిసిన వర్షం పత్తి మొక్కలకు ప్రాణం పోసింది. 15 రోజుల క్రితం వందల ఎకరాల్లో పత్తి గింజలు నాటడంతో భూమిలోని పదునుతో మొలకెత్తాయి. వర్షాలు లేకపోవడం, ఎండలు మండుతుండడంతో పత్తి మొలకలు ఎండిపోయే పరిస్థితి తలెత్తింది. మరో వైపు వేలాది ఎకరాల్లో వేసిన పత్తి గింజలు మొలకెత్తకుండా ఉండిపోయాయి. మండలంలో ఎట్టకేలకు భారీ వర్షం కురవడంతో రైతుల్లో హర్షం వ్యక్తమైంది. 15 రోజులుగా వర్షాలు లేక తాము ఆందోళన చెందుతున్న తరుణంలో కురిసిన వర్షం పత్తి పంటకు ఊపిరి పోసిందని రైతులు అంటు న్నారు. వరుణుడు కరుణించడంతో అన్నదాతలు ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

వాజేడు, జూన్ 16: మండల కేంద్రంలోని నాగారం గ్రామస్థులు ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు త్వరగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ గ్రామదేవతలను కొలిచారు. గోదావరి నుంచి జలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. గిరిజనుల సంప్రదాయం ప్రకారం గ్రామపెద్దలు, పూజారులు మొక్కులు చెల్లించారు.

● వెంకటాపురం(నూగూరు): మండలంలో తొలకరి వర్షాలు కురవడంతో పాత్రాపురం గ్రామంలో ఓడ బలిజ కులసంఘం నాయకులు, రైతులు గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య గ్రామదేవతల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఈఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి: ఏఐఎస్ఎఫ్



నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కాకతీయఖని, జూన్ 16: పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఆరేళ్ల బాలికను హత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జోసెఫ్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళన చేపట్టారు. నిందితుడి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం జోసెఫ్ మాట్లాడుతూ చిన్నారిని చిదిమేసిన నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, మహేందర్, రాజేశ్వరి, లావణ్య, రాధిక, ఓంకార్, దిలీప్, అరవింద్, రక్షిత తదితరులు పాల్గొన్నారు. -

జాతీయ సేవారత్న అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న బీసీ సంఘం నేతలు

కాటారం, జూన్ 16: ఇటీవల బహుజన సేవా సమితి ద్వారా జాతీయ సేవా రత్న అవార్డు అందుకున్న కొట్టె సతీష్, ఆత్మకూరి కుమార్ యాదవ్‌ను బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గ అధ్యక్షుడు దుర్కి కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. మండల కేంద్రంలో ఈ కార్యక్రమం ఆదివారం జరిగింది. పలువురు నాయకులు కవ్వాల శేఖర్, దుర్గం తిరుపతి, మంత్రి లక్ష్మణ్, శ్రీధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్లపల్లి పోచమ్మ జాతర



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కాటారం, జూన్ 16: మండలంలోని గుండ్రాత్‌పల్లి గ్రామ శివారులో వెలసిన ఉట్లపల్లి పోచమ్మ జాతర ఆది వారం ఘనంగా సాగింది. పలు ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు ఉట్లపల్లికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఏడాదిలో మార్చి నుంచి జూలై నెలాఖరు వరకు ప్రతి గురువారం, ఆదివారం సాగే జాతరకు భక్తులు హాజరవుతుంటారు. రైతులు తమ పంటల సమయంలో మొక్కుకున్న రీతిలో వడ్లు తెచ్చి అమ్మవారికి చెల్లించుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి వచ్చిన భక్తులు పోచమ్మ తల్లికి మొక్కుల అనంతరం చెట్ల కిందవిందు, వినోదాలతో గడిపారు.

పత్తి మొక్కలకు స్ప్రేయర్లతో నీళ్లు



స్ప్రేయర్‌తో పత్తి మొక్కలపై నీళ్లు పోస్తున్న రైతు

కాటారం, జూన్ 16:మండలంలోని చింతకాని, జగ్గయ్యపల్లి గ్రామాల పరిధిలో పలువురు రైతులు పత్తి చేలల్లో పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ల పుల్లీలతో పత్తి గింజలు నాటిన ప్రదేశాల్లో, కొద్దిగా మొలకెత్తి లుంగలు చుట్టుకు పోయినా ప్రాంతాల్లో నీళ్లను పోశారు. మండల లక్ష్మారెడ్డి, సుబ్బారెడ్డి, రమేష్, కోటిరెడ్డితో పాటు మరికొందరు రైతులు ప్లాస్టిక్ డ్రమ్ములు పెట్టి ఇంటి వద్ద నుంచి ట్యాంకర్లలో నీటిని తెచ్చి ట్రాక్టర్ల పుల్లీలను ఆన్ చేసి పైప్‌ద్వారా నీళ్లను స్ప్రే చేయడం కనిపించింది. కొందరు పురుగుమందులు కొట్టే స్ప్రేయర్లతో నీళ్లను పత్తి గింజలు, మొక్కలపై పిచికారీ చేస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి నాటిన పత్తి గింజలు మొలకెత్తి బతికేలా మరింత ఖర్చు చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీపై విచారణ చేపట్టాలి
ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్

కాకతీయఖని, జూన్ 16: భూపాలపల్లి ఏరియాలోని సింగరేణిలో తప్పుడు డాక్యుమెంట్లతో ప్రైవేటు సెక్యూరిటీ కాంటాక్టర్‌గా కొనసాగుతున్న వ్యక్తిపై విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సింగరేణి అధికారుల సహకారంతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన వ్యక్తి సెక్యూరిటీ కాంట్రాక్ట్ సంపాదించినట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీలో ఉద్యోగాల పేరుతో రూ. 44లక్షలు వసూలు చేసేందుకు పూనుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జోక్యంతో వారి ఆగడాలకు అడ్డుకట్ట పడిందని తెలిపారు. గతంలో భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన అధికారి ఇచ్చిన తప్పుడు సమాచారం వల్ల ఆ కాంట్రాక్టర్ అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. అతడిపై సింగరేణి, విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గోవులను వధించొద్దు
బీజేపీ జిల్లా అధ్యక్షుడు బలరాం



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

ములుగు కలెక్టరేట్, జూన్ 16: బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను వధించొద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోవు హిందువుల ఆరాధ్యదైవమన్నారు. ముక్కోటి దేవుళ్ల గోవులో ఉంటాయని అన్నారు. హిందువులు పూజించే గోమాతను వధించడం నేరమని అన్నారు. ఈవిషయంలో హైకోర్టు కూడా ఎక్కడా గోవధ జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కిసాన్‌మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి దొంతిరెడ్డి రవిరెడ్డి, నాయకులు ఎల్కతుర్తి శ్రీహరి, రాయంచు నాగరాజు, కత్తి హరీష్, బోగిరి రాకేష్, గొట్టిముక్కుల నరేష్‌శర్మ పాల్గొన్నారు.

'దళితుల భూములు కాజేసేందుకు కుట్ర'

చిట్యాల, జూన్ 16: మండలంలోని నవాబుపేట శివారు సర్వే నంబరు 45లో వారసత్వంగా తాము కాస్తులో ఉంటున్నామని, మాజీ సర్పంచ్ భర్త అక్రమంగా ఆక్రమించుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని పలువురు దళితులు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చిలుముల రాజయ్య, బొజ్జపెల్లి భద్రయ్య, రవీందర్, సాంబయ్య మాట్లాడుతూ వందేళ్లుగా తమ కుటుంబాల ఆధీనంలో ఉన్న భూములకు అక్రమంగా పట్టా చేయించుకుని అర్ధరాత్రి ట్రాక్టర్, యంత్రాలతో మట్టిని పోయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈసమావేశంలో